# ఇక్కడే నీకు బాగుందా ?

తలుపు తెరిచే ఉంది. చదువుకునే వేళప్పుడు తలుపు తెరిచే ఉంచాలి. అందుకని తలుపు తట్టటం జరగకుండానే తనకు ఇష్టంలేని గొంతు, "ఏయ్, రాబర్ట్స్, వాన్ నెస్ ఆఫీసుకు రమ్మంటున్నారు !" అని పలికేసరికి రాబర్ట్సు ఉలిక్కిపడ్డాడు. ఆ గొంతు హ్యూస్‌ది.

"దేనికీ ?" అన్నాడు రాబర్ట్సు.

"వెళ్లి తెలుసుకో రాదూ?" అన్నాడు.

"నీ మొహం !" అన్నాడు రాబర్ట్సు.

"నీ మొహమే" అన్నాడు హ్యూస్.

రాబర్ట్సు డెస్కుముందునుంచి లేచి, కళ్లను పెట్టుకున్న షేడ్ తీసేసి, పైవేసుకుని, కోటు తొడుక్కుని, దీపం ఆర్పకుండానే వెళ్లాడు.

వాన్ నెస్ ఆఫీసుగది కిందిఅంతస్తులో ఉన్నది. రాబర్ట్సు కిందికి దిగుతూ ఏం చేసిఉంటానా అని ఆశ్చర్యపడ్డాడు. అన్నిస్కూళ్ల చూసినాక, ఫలానివారు ఆఫీసుకు రమ్మంటున్నా రన్నదానికీ, ఫలానివారు నిన్ను కనపడమన్నారు అన్నదానికీ తేడా తెలిసిపోతుంది. ఏ మేస్టరుగాని స్వల్పవిషయం మాట్లాడటానికి ఆఫీసుకు పిలిపించడు. ఏదైనా ముంచుకొస్తేనే ఫలానివారి ఆఫీసుకు రమ్మంటున్నా రని చెబుతారు. అంటే ఆ ఫలానివారు నీ కోసం ఆఫీసులో కాచుకుని ఉన్నా రన్నమాట. ఈ తేడా ఎందు కుండాలో రాబర్ట్సుకు తెలీదుగాని తేడా ఉన్నదనిమటుకు తెలుసు. ఎంత ఆలోచించినా తాను స్నానాలగదిలో సిగిరెట్టు కాల్చటం తప్ప ఇంకేమీ స్ఫురించలేదు. అయినా దాన్నిగురించి వాన్ నెస్ ఎన్నడూ పట్టించుకోలేదు. అందరూ స్నానాలగదిలో సిగిరెట్లు కాలుస్తారు. ఎవరినన్నా పట్టుకున్నప్పుడు తప్ప వాన్ నెస్ ఆ ఊఁ సెత్తడు.

చిన్న చిన్న తప్పులను గురించి మాట్లాడదలచినప్పుడు వాన్ నెస్ చదువుకునేవేళ గదు లన్నీ కలియతిరుగుతూ

జాన్ ఓహారా

వచ్చి మాట్లాడతాడు. ఆయన నడవ వెంబడి నింపాదిగా నడుస్తూ. ప్రతి గది లోకీ తొంగిచూసి. ఏ గదిలోగాని ఆ గదివాడే ఉన్నాడో మరో గదివాడున్నాడో చూస్తాడు. ఎవరిమీదనన్నా కేకలు పెట్ట దలుచుకున్నప్పుడు తనచేతిలో ఉండే జాబితా చూసి కేకలు పెట్టవలసినవాణ్ణి కేకలుపెట్టి శిక్ష ఏమిటో చెబుతాడు. అందుకే ఇలా ఆఫీసుకు పిలిపించట మంటే కొంచెం గుండె దడగా ఉంది.

ఓరగా తెరిచిఉన్న వాన్‌నెస్ ఆఫీసు గది తలుపుపైన రాబర్ట్సు తట్టాడు. "లోపలికి రా", అని ఓ గొంతుపలికింది.


పెద్దడెస్కు పక్కగా ఉన్న చిన్న డెస్కుపైన గల టైప్‌రైటరుముందు వాన్‌నెస్ కూచుని ఉన్నాడు. ఆయన తిరుగుడు కుర్చీలో కూచుని ఉండి రాబర్ట్సును చూస్తూనే కుర్చీతో బాటు గిర్రునతిరిగి పెద్దడెస్కు ముందుకు వచ్చాడు.

ఆయన నోట్లో పైపు ఉన్నది. కళ్ల ద్దాల ఇనపచట్రం మీదుగా చూస్తున్నట్టు కనబడ్డాడు. దీపం వెలుతురు ఆయన "ఫై-బీటా-కొప్పా" తాళపుచెవిమీద పడి అందులోరత్నాలుపొదిగినట్టుజిగేల్మంది.

"మీరు రమ్మన్నారని హ్యూస్ చెప్పాడు" అన్నాడు రాబర్ట్సు.

"అన్నాను" అన్నాడు వాన్‌నెస్. "అన్నాను" అని మళ్లీ అంటూ ఆయన తాపీగా తనపైపును కొట్టుతూ అందులోని పుగాకు ఖాళీ చేశాడు. ఈ పని చాలా నింపాదిగా జరిగింది. ఇదంతా నాన్చి చంపే పద్ధతి అని అనుభవంవల్ల రాబర్ట్సు గ్రహించాడు. అవతలవాణ్ణి అదరగొట్టటానికి ఎప్పుడూ ఇలాగే చేస్తారు. ఇదొకవిధమైన హింస. దీని తాడు తెగ, ఎన్నిసార్లు అనుభవమైనా ఎప్పటి కప్పుడు దడపుట్టనే పుడుతుంది.

వాన్‌నెస్ కుర్చీలో వెనక్కు వాలి కళ్లద్దాల్లోంచి రాబర్ట్సుకేసి చూసి గొంతు సవరించుకుని "కూర్చో" అన్నాడు.



"సరే, సర్" అంటూ రాబర్ట్సు కూచున్నాడు. వాన్‌నెస్ అతన్ని మళ్లీ ముళ్లమీద ఉంచాడు.

"రాబర్ట్సు, ఇక్కడ ఎంతకాలమైౖ ఉన్నావు— అయిదువారాలా?"

"ఇంకా ఎక్కువే. దాదాపు ఆరు."

"దాదాపు ఆరువారాలు", అన్నాడు వాన్‌నెస్. "జనవరి ఏడునుంచీ, ఆరు వారాలు. చిత్రం. చిత్రం. ఆరువారాలు. అయినా నిన్ను గురించి నాకు ఒక్క సంగతీ తెలీదు. కనీసం చెప్పుకోదగినంతగా తెలీదు. రాబర్ట్సు, నిన్ను గురించి కాస్త చెప్పు."

"మీ ఉద్దేశ మేమిటి మిస్టర్?"

"నా ఉద్దేశమా? ఏముందీ — మమ్మల్ని పావనం చెయ్య నిర్ణయించుకోకమునుపు నీ జీవితం గురించి — ఎక్కడినుంచి వచ్చావో, ఏం చేశావో అన్ని స్కూళ్లకు ఎందుకు వెళ్లావో, అదంతా."

"ఏమో నాకు తెలీదు".

"అఁహఁ, అదేమిటి, రాబర్ట్సు? నీ ఆత్మకథ చెప్పుకోవటాని కంత బిడియం దేనికీ? ఆ తలుపు మూసి రా."

రాబర్ట్సు లేచి తలుపు మూశాడు.

"భేష్. ఇక చెప్పుకురా— కవిలె విప్పు. రాబర్ట్సు గురించి దాచకుండా అంతా చెప్పు. రాబర్ట్సు, హంఫ్రీ, రెండోఫారం, మకాలిస్టర్ మెమోరియల్ హాల్ వగైరా వగైరా."

హంఫ్రీ రాబర్ట్సు కూచుని తన పైముడి తడుముకున్నాడు. "ఏముందీ, న్యూయార్క్‌లో వెస్ట్‌పాయింట్ వద్ద పుట్టాను. అప్పుడు మా నాన్న ఫస్ట్ లూటినెంట్, ఇప్పుడు మేజరు. మా నాన్నా, అమ్మా, నేనూ ఎన్నోచోట్లు మారాం. ఆయన సైన్యంలో ఉండటం చేత బదిలీ చేస్తూండేవారు. మీకు కావలసింది ఇటువంటి వివరాలేనా, మిస్టర్?"

"కానీ,కానీ. అవసరమైతేచెబుతాన్లే-ఆపమని." 'ఆపమని' అనేమాటలో ఏదో హాస్యం ఉన్నట్టు వాన్‌నెస్ భావించాడు.

"సరే, పదేళ్లదాకా నేను అంటిపెట్టి స్కూలుకు వెళ్లలేదు. మా అమ్మ మా నాన్నవద్ద విడాకులు పుచ్చుకున్నాక నేను శాన్‌ఫ్రాన్‌సిస్కోలో స్కూలుకు వెళ్లాను. నే నక్కడ ఒక ఏడే చదివాను. ఎందుకంటే మా అమ్మ మళ్లీ పెళ్లాడింది. మేము ఇలినాయిస్‌లో షికాగోకు మారాం."

"ఇలినాయిస్‌లో షికాగో! కొంచెం జాగ్రఫీ కూడానూ. కాదా, రాబర్ట్సు? ఉచితంగా. థాంక్ యూ. కానీ."

"సరే, అందుకని మేం రెండేళ్లపాటు అక్కడే ఉండి, తరవాత మళ్లీ తూర్పుకు వచ్చేశాం. మా మారుతండ్రి

పట్టాగల పబ్లిక్ ఎకౌంటెంటు. ఒకచోట ఉండేవాళ్లం కాము.''

''చరరాశి, ఏం, రాబర్ట్సు ?''

''కావచ్చు. ఆ మాటకు సరిఅయిన అర్థం నాకు తేలీదు,'' రాబర్ట్సు ఆగాడు.

''చెప్పు, చెప్పు.''

''సరే, అందుకని నేను చాలా స్కూళ్లకు వెళ్లాను. కొన్ని విడిపాఠశాలలు, కొన్ని వసతి పాఠశాలలు. అదంతా నా స్కూలు దరఖాస్తులో రాసి ఉంది. అదంతా నేను రాసిపెట్టాను.''

''కరెక్ట్. గొప్ప జాబితా, రాబర్ట్సు, చాలాగొప్పజాబితా. నువు చేసిన ప్రయాణమేనా, రాబర్ట్సు. స్విట్జర్లాండ్. స్విట్జర్లాండ్‌లో చదవనందుకు నేనెంత దిగులుపడ్డానో. అక్కడ బాగుండేదా?''

''అక్కడ మూడునెలలే ఉన్నాను. బాగానే ఉండే దనుకుంటాను.''

''మరి ఇక్కడ బాగుందా, రాబర్ట్సు?''

''ఓ.''

''బాగుందా ? నిజమేనా ? ఇక్కడ మార్పు లేమీ అవసరం లేదా ?''

''అవసరం లేదని అనను. ఏ స్కూలు గురించీ అనను.''

''నిజంగానా ?'' అన్నాడు వాన్‌నెస్. ''నీకు గల విశేషానుభవంవల్ల నీకు విద్యావిధానమంతా కరతలామలకమే మరి. ఆధునిక విద్యావిధానంలోని గుణ




''ఆయన వాళ్ళింటి కొచ్చిన వాళ్ళందరినీ 'పడక్కుర్చీ'లో కూర్చోమని బలవంతం చేస్తా దేమిటి ?''

''వాళ్ళు లేచి వెళ్ళిన తరువాత డబ్బులు పడితే ఏరుకోవచ్చు నని.''

---

లోపాలుగురించి నీకు అనేక సిద్ధాంతాలు కూడా ఉండిఉంటా యనుకుంటాను.''

''ఏమో, నాకు తెలీదు. నేనల్లా— నాకు తెలీదు. కొన్ని స్కూళ్లకన్న కొన్ని ఎక్కువ బాగుంటాయి. ఏమైనా నాకు కొన్ని అంటే ఎక్కువ ఇష్టం.''

''అలాగే, అలాగే.'' వాన్‌నెస్ ఇంకేదో గురించి ఆలోచిస్తున్నట్టు కనబడ్డాడు. ఆయన తిరుగుడు కుర్చీలో వెనక్కు వాలి కప్పుకేసి చూశాడు. ఆయన తన చేతులను పంట్లాం జేబుల్లోకి పోనిచ్చి అకస్మాత్తుగా ముందుకు

వంగాడు. కుర్చీ ముందుకు వంగింది. ఆయన పొట్ట డెస్కు‌కు గట్టిగా నొక్కు కున్నది. ఆయన చెయ్యి పొడుగ్గా డెస్కు‌మీద చాచుకున్నది. పిడికిలి బిగ బట్టి ఉన్నది.

"రాబర్ట్సు! దీన్ని ఎప్పుడన్నా చూశావా? చెప్పు!" వాన్‌నెస్ గొంతు కర్కశంగా ఉంది. ఆయన పిడికిలి విప్పాడు. అందులో ఒక రిస్టువాచీ ఉన్నది.

రాబర్ట్సు వంగి దానికేసి చూశాడు. "లేదు. చూశా ననుకోను" అన్నాడు, నిజం చెప్పగలిగినందుకు సంతోషిస్తూ.

వాన్‌నెస్ చెయ్యి అలాగేచాచి ఉండి పోయింది, అరిచేతిలో రిస్టువాచీతో. ఆయన ఏమీ అనకుండానే చాలాసేపు–కనీసం పావునిమిషంపాటు–తన చేతిని చాచిఉంచాడు. తరవాత చెయ్యి పక్కకు తిప్పి వాచీ డెస్కు‌మీద పడనిచ్చాడు. ఆయన తన కుర్చీలో మళ్లా యథాప్రకారం కూచున్నాడు. తన పైపు తీసుకుని తాపీగా పొగాకు నించి, అంటించాడు. ఆరిపోయినాకకూడ అగ్గిపుల్లను చాలా సార్లు ఆడించాడు. కుర్చీలో రాబర్ట్సుకు పెడమొహంగాతిరిగి గోడకేసిచూశాడు. "చిన్నప్పు డీ స్కూలులో ఆరేళ్లు చదివాను. నా అన్నదమ్ము లిద్దరూ ఇక్కడే చదివారు. మా నాన్న ఈ స్కూల్లో చదివాడు. నేను పదేళ్లకు పైగా ఈ స్కూల్లో పనిచేస్తున్నాను. నేను ఈ స్కూల్లో ఒక భాగ మనీ, కొంతవరకైనా ఈ స్కూలు అభివృద్ధికి తోడ్పడ్డా ననీ అనుకుంటే నాకు సంతోషం. నా సహాధ్యాయుల కొడుకులు ఇప్పు డీ స్కూల్లో ఉన్నారు. ఆ కాలేజీలోనూ, ఈ కాలేజీలోనూ పనిచేసే అవకాశాలు నాకు దొరక్కపోలేదు. కాని నే నిక్కడే ఉండా లనుకున్నాను. ఎందుకు? దేనికి? నా కీ చోటంటే ప్రేమ గనక. నా కీ చోటంటే ప్రేమ, రాబర్ట్సు. దీనికిగల సంప్రదాయాలూ, కీర్తీ నా కిష్టం." ఆయన ఆగి రాబర్ట్సు కేసి తిరిగి, "రాబర్ట్సు, ఇక్కడ దొంగలకు తావు లేదు!'' అన్నాడు.

రాబర్ట్సు మాట్లాడలేదు.

"ఇక్కడ దొంగలకు తావులేదన్నాను!"

''అవును, సర్."

వాన్‌నెస్ గడియారం కేసి చూడకుండానే దాన్ని ఎత్తాడు, దాన్ని డెస్కు ఎగువగా ఎత్తిపట్టుకున్నాడు. "ఈ దిక్కుమాలిన గడియారం కిందటి శుక్రవారం అపరాహ్ణం, బహుశా బాస్కెట్‌బాల్ గేము జరిగేటప్పుడు దొంగిలించబడింది. దొంగతనం జరిగినట్టు తెలియగానే దర్యాప్తు సాగించాను. నా దర్యాప్తు



"ప్రేమించమంటే ప్రేమిస్తాననుకో; కాని, ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా ?''

ఫలించలేదు. సోమవారం అపరాహ్ణాన ఎవరో ఈ గడియారం తెచ్చి ఇక్కడ నా గదిలో పెట్టారు. సోమవారం అపరాహ్ణం నేను పాఠాలు ముగించి వచ్చే సరికి గడియారం నా డెస్కుమీద ఉన్నది. ఎందుచేతా ? దొంగతనం చేసిన పరమనీచుడు నేను దర్యాప్తు ప్రారంభించినట్టు తెలుసుకుని హడలిపోయి ఈ వస్తువు తిరిగి నా పరం చేశాడు. వాడు ఎవడైనా కానీ, మొత్తం స్కూలు నంతట్నీ అనుమానానికి గురిచేశాడు. నేను నీకు చెప్పేదల్లా ఏమంటే, ఈ గడియారం ఎవరు దొంగిలించారో, ఎవరు మళ్ళీ తెచ్చి నా గదిలో ఉంచారో నాకు తెలీదు. కాని, రాబర్ట్సు, దైవ సాక్షిగా నేను వాణ్ణి పట్టుకొనబోతున్నాను. అంతే, రాబర్ట్సు. నీవు వెళ్ళ వచ్చు." వాన్‌నెస్ ఇంచుమించు ఉక్కిరి బిక్కిరి అయినవాడిలాగా అయిపోయి కుర్చీలో చేరగిలబడ్డాడు.

రాబర్ట్సు లేచి నిలబడి, "ప్రమాణ పూర్తిగా నేను" అన్నాడు.

"నువు వెళ్ళవచ్చునన్నాను!" అన్నాడు వాన్‌నెస్.

తలుపు తెరిచి ఉండనివ్వాలో, మూయాలో రాబర్ట్సుకు తెలియలేదు. కాని అడగలేదు. తెరిచే ఉంచాడు.

అతను మెళ్లెక్కి తనగదికి వెళ్లాడు. కోటూ, టై విప్పాడు. మొదట కసిగానూ, తరవాత నీరసంగానూ, "లంజాకొడుకు, తప్పుడు లంజాకొడుకు", అని పదేపదే అనుకున్నాడు. ★